సాక్షి ఆదిలాబాద్

గురువారం । 5 । అక్టోబర్ । 2023

I



అవార్డుల.. 'హరిత'

IIలో ▸

కడెం ప్రాజెక్ట్ తీరంలోని హరిత రిసార్ట్ పర్యాటకులను ఆకర్షిస్తోంది. చక్కని అతిథ్యం అందిస్తూ అవార్డులు సొంతం చేసుకుంటుంది.

రెండో రోజుకు '104' దీక్షలు

కైలాస్‌నగర్: తమ సమస్యల పరిష్కారంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో కలెక్టరేట్ ఎదుట 104 ఒప్పంద సిబ్బంది చేపట్టిన రిలే దీక్షలు రెండో రోజుకు చేరాయి. బుధవారం నాటి దీక్షలో పలువురు మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఏజెన్సీ విధానం రద్దు చేసి ఖజానా నుంచి నేరుగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.



వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

ఆసరా.. సమస్యలా?

- అందుబాటులోకి టోల్‌ఫ్రీ నంబర్

కైలాస్‌నగర్: జిల్లాలో ఆసరా పథకం కింద పింఛన్ పొందుతున్న వారి సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్లు డీఆర్డీవో కిషన్ ప్రకటనలో తెలిపారు. పింఛన్‌దారులు తమ సమస్యలను 81860 00940 నంబరు ద్వారా తెలియజేసి పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. అన్ని పని దినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ నంబర్ పని చేస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

'అల్పాహారం' ఏర్పాట్లు చేపట్టాలి



సూచనలిస్తున్న అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా

ఆదిలాబాద్‌రూరల్: ఈ నెల 6న ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించనున్న సీఎం కేసీఆర్ అల్పాహారం కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ కుష్బు గుప్తా అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాందా (టి), పొచ్చర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను బుధవారం పరిశీలించారు. కార్యక్రమ విజయవంతం కోసం వివిధ గ్రామస్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఆమెవెంట డీఈవో ప్రణీత, ఎంఈవో జయశీల, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

సదరం స్లాట్ బుకింగ్‌కు అవకాశం

కైలాస్‌నగర్: జిల్లాలోని దివ్యాంగులు వైకల్య నిర్ధారణ ధ్రువీకరణ పత్రం(సదరం సర్టిఫికెట్) పొందుటకు మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్‌కు అవకాశం కల్పించినట్లు డీఆర్డీవో కిషన్ ప్రకటనలో తెలిపారు. రెన్యువల్‌కోసం, కొత్తగా సర్టిఫికెట్ పొందాలనుకునే వారు అక్టోబర్ 2023 నెలకు గాను స్లాట్ బుక్ చేసుకుని ఆయా తేదీల్లో నిర్వహించే సదరం శిబిరానికి హాజరు కావాలని సూచించారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



ర్యాలీలో పాల్గొన్న అటవీశాఖ అధికారులు

నేరడిగొండ: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని ఇచ్చోడ ఎఫ్‌డీవో బర్నోబా అన్నారు. వన్యప్రాణి సప్తాహ పురస్కరించుకొని మండల కేంద్రంలో బుధవారం బైక్ ర్యాలీ చేపట్టారు. అలాగే వడూర్–కిష్టాపూర్ అటవీ ప్రాంతంలో ఏడు కిలోమీటర్ల మేర ట్రెక్కింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీవో మాట్లాడుతూ, అడవితోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. వన్యప్రాణులకు హాని కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నేరడిగొండ, బోథ్, ఇచ్చోడ ఎఫ్ఆర్‌వోలు గణేశ్, ప్రణయ్, పుండలిక్, ఆయా రేంజ్‌లలోని ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.

'ఓపెన్' ప్రవేశాల గడువు పెంపు

ఎదులాపురం: 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఓపెన్ స్కూల్‌లో టెన్త్, ఇంటర్ ప్రవేశాల దరఖాస్తు గడువు ఈ నెల 13వరకు పొడిగించినట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు www.telanganaopenschool.org వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



క్రీడా ప్రాంగణం పరిశీలిస్తున్న అధికారులు

నార్నూర్: అభివృద్ధిపనులు వేగవంతం చేయాలని ఏకలవ్య స్పోర్ట్స్ అధికారి వీర్యానాయక్, గిరిజన సంక్షేమ శాఖ స్పోర్ట్స్ అధికారి రవికుమార్ అన్నారు. మండలకేంద్రంలోని ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలను బుధవారం వారు సందర్శించారు. పాఠశాలలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం క్రీడా మైదానాన్ని పరిశీలించారు. వారి వెంట వైస్ ప్రిన్సిపాల్ శ్రీరాములు, పీడీ అతులకుమార్, పీఈటీ అనూష, ఉన్నారు.

తేలిన లెక్క



జిల్లా ఓటర్లు 4,42,438

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు
జైనథ్	19,010	19,715	–
బేల	15,242	15,192	–
ఆదిలాబాద్‌రూరల్	16,289	17,162	02
మావల	17,696	18,502	03
ఆదిలాబాద్‌అర్బన్	47,598	49,337	–
భీంపూర్	9,088	9,758	–
తాంసి	6,432	6,998	–
తలమడుగు	13,121	13,738	–
గుడిహత్నూర్	11,888	12,257	
ఇచ్చోడ	16,476	17,275	01
సిరికొండ	3,355	3,538	
బోథ్	17,796	18,960	01
బజార్‌హత్నూర్	11,355	11,727	
నేరడిగొండ	11,145	11,780	01

- ఓటరు తుది జాబితా విడుదల
- పురుషులతో పోల్చితే మహిళలే అధికం
- రెండు నెలల్లో పెరిగిన ఓటర్లు 8,949

నియోజకవర్గాల వారీగా వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు
ఆదిలాబాద్	1,15,835	1,19,908	5
బోథ్	1,00,656	1,06,031	03

కైలాస్‌నగర్: రాష్ట్రంలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2023 తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం విడుదల చేసింది. ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 4,42,438 మంది ఓటర్లు ఉన్నట్లుగా లెక్క తేలింది. ఇందులో పురుష ఓటర్లు 2,16,491 మంది ఉండగా, మహిళా ఓటర్లు 2,25,939 ఉన్నారు. థర్డ్‌జెండర్ 8మంది ఉన్నారు. ఈ జాబితాలను కలెక్టరేట్‌తో పాటు బోథ్, ఆదిలాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు, అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రదర్శించనున్నారు. అలాగే బీఎల్‌వో (అంగన్‌వాడీ, ఐకేపీ వీవోఏ)ల వద్ద అందుబాటులో ఉంచనున్నారు. జిల్లాకు చేరిన ఈ జాబితాలను ఆయా మండలాల ఆర్ఐలు, సంబంధించిన అధికారులకు అందజేశారు. కాగా ఓటరు తుది జాబితా విడుదల కావడం కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రంలో పర్యటిస్తుండంతో ఎన్నికల ప్రకటన ఎప్పుడైనా వెలువడవచ్చనే అభిప్రాయం అధికార వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

మహిళా ఓటర్లే అధికం

రానున్న ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల భవితను నిర్ణయించే శక్తి జిల్లాలో మహిళలకే ఉంది. ఎందుకంటే పురుషులతో పోల్చితే మహిళా ఓటర్లు 9,448 మంది ఎక్కువగా ఉండడమే. రెండు నియోజకవర్గాలోనూ అతివలదే ఆధిపత్యం కనిపిస్తోంది.

కొత్త ఓటర్లు 8,949

ఈ ఏడాది ఆగస్టు 1న ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితాలో 4,33,491మంది ఉన్నారు. తాజాగా ఈ సంఖ్య 4,42,438కి పెరిగింది. కొత్తగా 8,949 మంది జాబితాలోకి చేరారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఆగస్టు 26, 27, సెప్టెంబర్ 2,3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టింది. బీఎల్‌వోలు ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఉండి కొత్త ఓటు నమోదు కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 18ఏళ్లు నిండిన యువతను ఓటర్లుగా నమోదు చేయించారు. దీంతో ఈ ఓటర్ల సంఖ్య పెరిగింది.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

కైలాస్‌నగర్: గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్యామలాదేవి బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈసీ విడుదల చేసిన ఓటర్ల తుది జాబితా వివరాలను వారికి వివరించారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో కొత్తగా నమోదైన, తొలగించిన ఓటర్ల వివరాలతో కూడిన సీడీలను వారికి అందజేశారు. ఇందులో ఆర్డీవో స్రవంతి, డీఏవో వర్ణ, నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యర్థులెవరో..?

- కొనసాగుతున్న ఉత్కంఠ
- ఇంకా ఖరారు కాని కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు
- బోథ్‌లో మారుతున్న సమీకరణాలు
- ఆశావహుల్లో కలవరం
- త్వరలో ఎన్నికల షెడ్యూల్ జారీ



సాక్షి,ఆదిలాబాద్: అభ్యర్థుల ఖరారులో బీఆర్ఎస్ ముందుండగా, ప్రత్యర్థులు ఎవరనేదాని విషయంలో ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులుగా ఎవరిని ఖరారు చేస్తారనే విషయంలో ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. మరోపక్క దరఖాస్తు చేసుకున్న వారిలో నుంచే అభ్యర్థిని ఎంపిక చేస్తారా.. లేనిపక్షంలో పార్టీ నిర్ణయం ఎలా ఉంటుందనేది కూడా ఆశావహుల్లో కలవరం కలిగిస్తుంది. మారుతున్న సమీకరణాలే దీనికి కారణమవుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి ఎనిమిది మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. బోథ్ నియోజకవర్గం నుంచి ఏకంగా 18 మంది దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. బీజేపీ పరంగా ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల నుంచి ఎనిమిది చొప్పున దరఖాస్తు చేసుకున్నారు. అప్లికేషన్ ప్రక్రియ ముగిసి రోజులు గడుస్తున్నా అభ్యర్థి విషయంలో ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు. ప్రధానంగా బోథ్ నియోజకవర్గంలో ఎప్పుడు ఎలాంటి మార్పు ఉంటుందనేది ఉత్కంఠ రేపుతోంది. దీనికి కారణం లేకపోలేదు.. ఒక పక్క ఎంపీ సోయం బాపూరావు కాంగ్రెస్ నుంచి బోథ్ నియోజకవర్గం నుంచైనా, లేనిపక్షంలో ఆసిఫాబాద్ నుంచైనా బరిలో నిలుస్తారని ప్రచారంలో ఉంది. అయితే తాను పార్టీ మారడం లేదని ఆయన ఖండిస్తున్నారు. అంతే కాకుండా బోథ్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావుకు అధికార పార్టీ నుంచి టికెట్ దక్కకపోవడంతో ఆయన కాంగ్రెస్ నుంచి ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం ఉంది. మరోపక్క మాజీ ఎంపీ గొడం నగేశ్ బీజేపీలో చేరుతారనే ప్రచారం ఉన్నప్పటికీ ఇటీవల అది సైలెంట్ అయ్యింది. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో ఈ నియోజకవర్గం నుంచి ఎలాంటి మార్పులు చేర్పులు ఉంటాయనేది ఆసక్తికరం.

ఇక షెడ్యూల్ రావడమే తరువాయి..

ఇదిలా ఉంటే బుధవారం తుది ఓటరు జాబితా జారీ అయ్యింది. ఇక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడమే తరువాయి. భారత ఎన్నికల కమిషన్ సీఈసీ రాజీవ్ కుమార్‌తో కలిసి 17 మంది సభ్యులు గల బృందం రాష్ట్రంలో మూడు రోజుల పర్యటన జరుపుతుండగా, బుధవారం హైదరాబాద్‌లో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశమైంది. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ జారీ అవుతుందని చెబుతున్నారు. దానికి తగ్గట్టే యంత్రాంగం అన్ని ఏర్పాట్లకు సిద్ధమవుతోంది.

ఎనిమిది గంటల పని విధానం కల్పించాలి



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఆదిలాబాద్: గ్రామీణ తపాలాశాఖ అధికారులకు ఎనిమిది గంటల పని విధానం కల్పించాలని నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని హెడ్‌పోస్టాఫీస్ ఎదుట బుధవారం ఒక రోజు సమ్మెలో భాగంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ తపాలా ఉద్యోగులకు పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు కల్పించాలన్నారు. సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5 లక్షలకు పెంచాలన్నారు. కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సు చేసిన బంచింగ్ అమలు చేయాలన్నారు. ఇందులో నాయకులు దశరథ్ రెడ్డి, జాదవ్ కిరణ్, అశోక్, రాకేశ్, దిలీప్, భాస్కర్, కిషన్ తదితరులున్నారు.

గంగను చేన్లకు తెచ్చినం



నిర్మల్‌లో నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన జనం

- 50వేల ఎకరాలకు నీళ్లిస్తున్నం
- ఆయిల్‌పామ్‌తో రైతులకు లబ్ధి
- జిల్లాను మరింత అభివృద్ధి చేస్తాం
- నిర్మల్ పర్యటనలో మంత్రి కేటీఆర్
- మంత్రి అల్లోలతో కలిసి శంకుస్థాపనలు

నిర్మల్/దిలావర్‌పూర్/సోన్/నిర్మల్‌టౌన్: 'శ్రీలక్ష్మీ నర్సింహస్వామి పేరుమీద రూ.714కోట్లతో ఎత్తిపోతల పథకం ఇయ్యల్ల ప్రారంభించుకున్నం. అక్కడ గుండంపల్లి పంప్‌హౌస్‌ల బటన్ ఒత్తినం.. ఇక్కడ డెలివరీ సిస్టర్న్ కాడికి మేం వచ్చేకంటే ముందే గోదారమ్మ వచ్చేసింది. గంగమ్మకు పూజచేసి, చీరెసారె పెట్టి.. అమ్మా మమ్మల్నందరినీ కూడా బ్రహ్మాండంగా చూసుకో.. దిలావర్‌పూర్, సారంగపూర్, నిర్మల్, మామడ, కుంటాలమండలాల్లో మొత్తం 50వేల ఎకరాలకు నీళ్లిచ్చే ఈ పథకంతో ఎప్పుడూ ఈప్రాంతం సస్యశ్యామలంగా ఉండాలని మొక్కుకున్నం..' అని రాష్ట్ర మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పేర్కొన్నారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి బుధవారం జిల్లాలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నిర్మల్ జిల్లాకేంద్రంలో నిర్వహించిన సభలో మాట్లాడారు. ముథోల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, జోగు రామన్న, ఎమ్మెల్సీ దండె విఠల్, నిర్మల్, ఆదిలాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, రాథోడ్ జనార్దన్, ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఖానాపూర్, బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థులు జాన్సన్ నాయక్, అనిల్‌జాదవ్, నాయకుడు పైడిపల్లి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికీ సస్యశ్యామలం

ఈ ప్రాంత రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కలను సీఎం కేసీఆర్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పట్టుపట్టి పూర్తిచేయించారని తెలిపారు. ఒకప్పుడు ఎస్సారెస్పీ ఎండిపోయి రైతన్నకు కన్నీళ్లు మిగిలిస్తుండేనని, నీళ్ల కోసం కొట్లాటలు పెట్టిస్తుండేనని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ అపర భగీరథుడిలా కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా రివర్స్ పంపింగ్ విధానంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌ను నింపుతున్నారని చెప్పారు. ఇప్పుడు ఎస్సారెస్పీ సముద్రంలా కనిపిస్తోందని తెలిపారు. అక్కడి బ్యాక్‌వాటర్ నుంచి ఇప్పుడు లక్ష్మీనర్సింహస్వామి ఎత్తిపోతలతో గంగమ్మను రైతుల చేన్లకు తెచ్చుకున్నామని పేర్కొన్నారు. ఇక ఎప్పటికీ ఈ ప్రాంతం పచ్చని పంటలతో సస్యశ్యామలంగా ఉంటుందని తెలిపారు.

భూముల ధరలు పెరిగినయ్..

గత ప్రభుత్వాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 14–15 ప్రాజెక్టుల పనులను పెండింగ్‌లో పెట్టాయని, వాటన్నింటినీ తొమ్మిదేళ్లలో పూర్తిచేశామని పేర్కొన్నారు. త్వరలోనే సదర్‌మాట్ ప్రాజెక్ట్ పూర్తవుతుందని తెలిపారు. ప్రాజెక్టులన్నీ పూర్తయి నీళ్లు అందుతుండటంతో పచ్చని పంటలు పండుతున్నాయన్నారు. గుట్టలపై భూములకూ ఎకరాకు రూ.20లక్షల నుంచి రూ.25లక్షల దాకా ధర పెరగడం సంతోషంగా ఉందని తెలిపారు. రైతుబంధుతో పాటు బీమాతో ధీమా ఇస్తున్న సర్కార్‌ను గుర్తించాలని కోరారు.

ఆయిల్‌పామ్‌కు డిమాండ్

దేశంలో 70శాతం మంది వాడే పామాయిల్‌ను ఇండోనేషియా, మలేషియా లాంటి దేశాల నుంచి తెచ్చుకుంటున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితి భవిష్యత్‌లో ఉండకూడదన్న ఉద్దేశంతో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నామన్నారు. సోన్ మండలంలో రూ.300కోట్లతో ప్రియూనిక్ ఆయిల్‌పామ్ కంపెనీ పెడుతోందని వివరించారు.

మాస్టర్‌ప్లాన్ మంచిగా చేసుకోవాలి

నిర్మల్ మాస్టర్‌ప్లాన్ గురించి కేటీఆర్ మాట్లాడుతూ.. గందరగోళంగా చేసుకున్నారని, అలా ఆగంకావొద్దని పేర్కొన్నారు. రెచ్చగొట్టేవాళ్లు ఉంటారని మంచిగా చేసుకోవాలని చెప్పారు. పట్టణమనేది మన కోసం కాదని, మన తర్వాత తరాలకూ ఉపయోగపడేలా ఉండాలని సూచించారు.



బోథ్ అభ్యర్థి అనిల్‌జాదవ్‌ను పరిచయం చేస్తున్న మంత్రి కేటీఆర్

ఇంద్రన్న ఏం తింటున్నవే..

'ఇంద్రకరణ్‌రెడ్డన్న మొన్న కడెం ప్రాజెక్ట్ ఎక్కడ కొట్టుకుపోతుందోనని బాధతో పోయి గేట్లు ఎత్తించిండు. నాకు 47ఏండ్లు, నాకు ఉల్టా అంటే.. ఇంద్రన్నకు 74ఏండ్లు. అయినా నాకంటే ముందే ఉరుకుతున్నడు. అన్నం ఏం తింటున్నవే.. ఏం ఎక్సర్‌సైజులు చేస్తున్నవే అని అడుగుతున్న..' అని మంత్రి ఐకే రెడ్డి గురించి కేటీఆర్ అనడం సభికులను ఆకట్టుకుంది. 'ప్రజల కోసం పనిచేస్తున్నాన్న తృప్తి తనను నడిపిస్తోంది' అని ఇంద్రకరణన్న చెప్పారని కేటీఆర్ పేర్కొన్నారు.

అందరూ గంగన్నలు, గంగవ్వలే..

'ఈ ప్రాంతమంతా గంగన్నలు, గంగవ్వలే ఉంటరు. గోదావరి అంటేనే గంగమ్మ కాబట్టి ఇక్కడి ప్రాంతమంతా గంగమ్మ పేర్లే పెట్టుకుంటరు. మొత్తం మీద ఈ ప్రాంతంలో ఉండే గంగమ్మలు, గంగయ్యలందరికీ పేరు పేరునా ధన్యవాదాలు..' అంటూ సోన్ మండలం పాత పోచంపాడ్ శివారులో నిర్వహించిన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ శంకుస్థాపన సభలో కేటీఆర్ పేర్కొన్నారు. గంగమ్మ ఆశీస్సులతో ఈ ప్రాంతమంతా సస్యశ్యామలంగా ఉంటుందని తెలిపారు. సముద్రంలా కనిపిస్తున్న ఎస్సారెస్పీ గోదావరిని చూస్తుంటే సంబురమైందని పేర్కొన్నారు.

మీవోళ్లు.. మంచోళ్లు..

'మీ జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలూ చాలా మంచోళ్లు, సల్లటి మనుషులు. మా ప్రజలు బాగుండాలని కోరుకునేటోళ్లు. ఇలాంటి ఇంద్రకరణన్న, విఠల్‌రెడ్డిని మళ్లీ గెలిపించాలె. అలాగే నా మిత్రుడు జాన్సన్ నాయక్‌ను ఖానాపూర్ ప్రజలు గెలిపించాలె. జాన్సన్ గెలిచిన తర్వాత.. నిర్మల్‌తో అభివృద్ధిలో పోటీ పడాలి..' అని మంత్రి కేటీఆర్ అనడంతో సభికులు భారీగా స్పందించారు.

ముఖరా(కె) ప్రజలు పైసలిస్తమన్నరు

'సార్.. మీహయాంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని, రైతులు, అన్నివర్గాలు బాగున్నారని చెబుతూ.. ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలోని ముఖరా(కె) గ్రామ ప్రజలు సీఎం కేసీఆర్‌కు, నాకు ఎన్నికల్లో నామినేషన్ల ఖర్చుకు పైసలిస్తమన్నారు. ఆ గ్రామం దేశంలోనే ఉత్తమ పంచాయతీగా గుర్తింపు పొందింది. ఆ ఊరి సర్పంచ్ మీనాక్షి గాడ్గే, ఊరిపెద్దలు మాకు నామినేషన్లకు డబ్బులు మేమిస్తామనడం చాలా సంతోషమేసిందని కేటీఆర్ గుర్తుచేశారు.

మహిళా సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే జోగు రామన్న



చీరెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామన్న

ఆదిలాబాద్‌రూరల్: మహిళా సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్‌రూరల్ ఎంపీడీవో సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన బతుకమ్మ చీరెల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆడపడుచులకు చీరెలు పంపిణీ చేసి మాట్లాడారు. తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ పండుగ ప్రతీక అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందన్నారు. ఇందులో ఎంపీపీ గంద్రత్ రమేశ్, వైస్ ఎంపీపీ జంగు, ఆత్మ చైర్మన్ జిట్ట రమేష్, ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొమ్మకంటి రమేశ్, పీఏసీఎస్ చైర్మన్ పరమేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు జగదీష్, మండల అధ్యక్షుడు రమణ, కుమ్ర రాజు, గంగయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్ డివిజన్ చేయాలని వినతి

- మంత్రి కేటీఆర్‌ను కలిసిన మండలవాసులు



కేటీఆర్‌తో బోథ్ డివిజన్ సాధన సమితి సభ్యులు

బోథ్: నిర్మల్ జిల్లాకు విచ్చేసిన మంత్రి కేటీఆర్‌ను బోథ్ డివిజన్ సాధన సమితి సభ్యులు బుధవారం కలిశారు. అన్ని అర్హతలున్న బోథ్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో 80 రోజులుగా ఉద్యమం కొనసాగుతోందన్నారు. ఈ మేరకు మంత్రి కేటీఆర్ స్పందిస్తూ.. డివిజన్ ఏర్పాటు విషయాన్ని సీఎం కేసీఆర్ ప్రకటిస్తారని తెలిపారు. అయితే ఎన్నికల్లోపు ప్రకటించేలా చొరవ చూపాలని మంత్రికి విన్నవించారు. ఇందులో ఎంపీపీ తుల శ్రీనివాస్, జెడ్పీటీసీ సంధ్యారాణి, బోథ్ సర్పంచ్ సురేందర్, ఇతర నాయకులు ఉన్నారు.

క్లుప్తంగా

డాక్టర్ లేక ఆందోళన



ఆందోళన చేస్తున్న నాయకులు

కడెం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి 10 రోజులుగా డాక్టర్ రాకపోవడంతో స్థానిక నాయకులు ఆందోళనకు దిగారు. ఆసుపత్రికి ప్రతిరోజు రావాల్సిన డాక్టర్ రాకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు. ఉపసర్పంచ్ ఆజాం, నాయకులు లక్ష్మణ్, అయ్యాజ్, సాగర్ ఉన్నారు.

ఓమిని వ్యాను దగ్ధం

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన రేగుంట రాజేందర్ ఓమిని వ్యాను బుధవారం ఆకస్మాత్తుగా మంటలు చెలరేగి దగ్ధమైంది. స్థానిక పెట్రోల్‌బంక్ వద్ద గత కొన్ని రోజులుగా నిలిపి ఉంచిన ఓమిని వ్యానులో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగి కాలిపోయింది. బంకులో పనిచేస్తున్న యువకులు మంటలు ఆర్పినప్పటికీ 80శాతం కాలిపోయింది.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబికానగర్‌కు చెందిన యువతి మంగళవారం సాయంత్రం అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. వాకింగ్‌కు వెళ్లి తిరిగి రాకపోవడంతో బుధవారం ఆమె తండ్రి ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ప్రమాదవశాత్తు యువకుడి మృతి



సాయితేజ (ఫైల్)

బోథ్: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన వొడ్నాల విఠల్ కుమారుడు వొడ్నాల సాయితేజ(19) ప్రమాదవశాత్తు మరణించాడు. ఎస్సై రాము వివరాల ప్రకారం.. ఈ నెల 3వ తేదీన రాత్రి సాయితేజ, చౌహాన్ నరేష్‌లు బైక్‌పై వెళ్తుండగా సొనాల నుంచి గుర్రాలతండా గ్రామానికి వెళ్లే మూలమలుపు వద్ద ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి పడిపోగా వారికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బోథ్‌లోని సీహెచ్‌సీకి, అక్కడి నుంచి ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు, అక్కడి నుంచి నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బుధవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. తండ్రి విఠల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపాడు.

ఆటో బోల్తా... ఇద్దరికి గాయాలు

కుంటాల: మండలంలోని కుంటాల నుంచి ఓలా వెళ్లే మార్గంలో బుధవారం ఆటో బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బోకర్‌కు చెందిన దీపక్, భైంసా మండలంలోని మాటేగాం గ్రామానికి చెందిన మంగళ్‌బాయితో కలిసి ఆటోలో కూరగాయలు విక్రయించేందుకు ఓలా సంతకు వెళ్తున్నాడు. కుంటాల సమీపంలోని మూలమలుపు వద్ద ఆటో బోల్తాపడడంతో గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రులను కుంటాల పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అవార్డుల.. హరిత



హరిత రిసార్ట్స్



రిసార్ట్‌లోని వ్యూపాయింట్



అవార్డ్ అందుకుంటున్న మేనేజర్ తిరుపతి

- ప్రకృతి అందాలకు నిలయం
- పర్యాటకులకు చక్కని అతిథ్యాన్ని ఇస్తూ
- ఉత్తమ రిసార్ట్స్‌గా కడెం హరిత

కడెం: కడెం ప్రాజెక్ట్ తీరాన.. పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణంలో అందమైనా విడిది గదులతో పర్యాటకుల మనసు దోచుతుంది కడెం హరిత రిసార్ట్స్. పర్యాటకులకు చక్కని అతిథ్యాన్ని అందిస్తూ.. అవార్డులను సొంతం చేసుకుంటుంది. ఇటీవలే హైదరాబాద్ శిల్పారామంలో నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో భాగంగా పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చైర్మన్ గెల్లు శ్రీనివాస్, ఎండి మనోహర్‌రావు చేతుల మీదుగా రిసార్ట్స్ మేనేజర్ నునవత్ తిరుపతి ఉత్తమ రిసార్ట్స్ అవార్డ్‌ను అందుకున్నారు.

ఆహ్లాదకరంగా హరిత రిసార్ట్...

కడెం ప్రాజెక్ట్ పరిసరాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఉద్దేశంతో ప్రాజెక్ట్ తీరాన 2015లో పర్యాటకశాఖ 12 విడిది గదులు, రెస్టారెంట్, మీటింగ్‌హాల్‌తో హరిత ఏకో టూరిజం రిసార్ట్స్‌ను ఏర్పాటు చేసింది. ఏడేళ్ల కాలంలో పర్యాటకుల ఉత్తమ సేవలందిస్తూ మూడు సార్లు బెస్ట్ రిసార్ట్స్ అవార్డ్‌ను అందుకుంది. ప్రముఖులతో పాటు, వివిధ సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు ఇక్కడి విడిది చేస్తుంటారు. సెలవు దినాల్లో, వీకెండ్‌లో పర్యాటకులతో సందడిగా ఉంటుంది. పర్యాటకులు సేదతీరేందుకు విడిది గదులతో పాటుగా, పిల్లలకు చిల్డ్రన్స్ ప్లే ఏరియా ఉంటుంది. పర్యాటకులతో పాటుగా ప్రీ వెడ్డింగ్, బర్త్‌డే షూట్‌లతో పాటుగా, ఫిల్మ్ షూట్‌లకు హరిత రిసార్ట్ ఫేమస్. అయితే ఇందులో తొమ్మిది మంది విధులు నిర్వహిస్తుండగా ఏడాదికి సుమారుగా రూ.4 నుంచి 5 లక్షల ఆదాయం సమకూరుతుంది.

సిబ్బంది సహకారంతో



రాష్ట్రంలోనే బెస్ట్ రిసార్ట్‌గా కడెం హరితకు అవార్డ్ దక్కడం వెనుక సిబ్బంది సహకారం ఎంతో ఉంది. మూడుసార్లు హరిత రిసార్ట్స్‌కు అవార్డ్ దక్కడం ఆనందంగా ఉంది. సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడికి పర్యాటకులు వస్తుంటారు. శుభాకార్యాలు, విందులు జరుపుకునేందుకు అవకాశం ఉంది. పర్యాటకుల టూరిజం శాఖ తరఫున సౌకర్యాలు అందిస్తున్నాం.

– నునవత్ తిరుపతి, హరిత రిసార్ట్స్ మేనేజర్, కడెం

గదుల బుకింగ్

పర్యాటక శాఖ వెబ్‌సైట్ ద్వారా గదులను బుక్ చేసుకోవచ్చు. డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ.టీఎస్‌టీడీసీ.కామ్ ద్వారా గదులను బుక్ చేసుకోవచ్చు. వీకెండ్‌లో (శుక్ర, శని, ఆదివారల్లో) 1848, మిగాత రోజు ల్లో 1680(జీఎస్టీతో కలిపి). మరిన్ని వివరాలకు 9133053007 నంబర్‌లో సంప్రదించవచ్చు.

సమస్యలపై నిలదీస్తే అరెస్ట్ చేస్తారా?

- డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు



మాట్లాడుతున్న శ్రీహరిరావు, నాయకులు

సారంగాపూర్: ప్రజాసమస్యలపై రాష్ట్ర మంత్రి కేటీఆర్‌ను నిలదీయడానికి వస్తే అక్రమంగా అరెస్ట్ చేస్తారా? అని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు ప్రశ్నించారు. మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి హెలీప్యాడ్ వద్దకు వెళ్లిన శ్రీహరిరావును బుధవారం అరెస్ట్ చేసి సారంగపూర్ పోలీస్టేషన్‌కు తరలించారు. ఈక్రమంలో పోలీసుల తీరును నిరసిస్తూ సారంగపూర్ పోలీస్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఆయన పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. గుండంపల్లిలోని కాళేశ్వరం ప్యాకేజీ నంబర్ 27 అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టును ఎలా ప్రారంభిస్తారో.. చెప్పాలని డిమాండ్ చేశారు. దిలావర్‌పూర్ మండలంలో పచ్చని పంటపొలాల మధ్య విషవాయువు వెలువరించి ప్రజల ప్రాణాలు, పచ్చటి పంటపొలాలకు హాని కలిగించే ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మించడం వెనుక మరమ్మమేమిటో తెలుపాలని పేర్కొన్నారు. వెంటనే దానిని రద్దు చేయాలని ప్రజల ప్రాణాలతో చెలగాటమాడవద్దని తెలిపారు. నిర్మల్ మున్సిపాలిటీలో అక్రమంగా 42 ఉద్యోగాలు అమ్ముకున్నారని తేలినప్పటికీ రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదో? ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇంత దారుణమైన పాలన సాగిస్తూ నియంతలా వ్యవహరిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి, ప్రజలకు సమాధానం చెప్పలేని మంత్రులకు ప్రజలే తగిన బుద్ధిచెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు తిరగబడతారని, ఓటు హక్కుతో బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. సమర్థవంతమైన పాలన అందించే కాంగ్రెస్‌నే ప్రజలు కోరుకుంటున్నారని, తప్పకుండా రాష్ట్రంలో ఆ పార్టీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తంజేశారు. ఈయన వెంట కాంగ్రెస్ నాయకులు అరుగుల రమణ, విలాస్‌రావు, బొల్లోజి నర్సయ్య, రొడ్డ మారుతి, అబ్దుల్ హాదీ, న్యాయవాది మల్లారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ వజీద్ అహ్మద్, పాడెల్లి గణేశ్ తదితరులున్నారు.

10న ఆదిలాబాద్‌కు అమిత్ షా

- బహిరంగసభ విజయవంతం చేయాలి
- ఎంపీ సోయం బాపూరావు



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపూరావు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి ఈనెల 10న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రానున్నట్లు ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు తెలిపారు. పట్టణంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభను ప్రతీ నాయకుడు, కార్యకర్త ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ ఆదిలాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయ్యన్నగారి భూమయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడమే ధ్యేయంగా ప్రతీ ఒక్కరూ పాటుపడాలన్నారు. జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఈ నెల 10న మధ్యాహ్నం ఒంటిగంటకు సభ ప్రారంభమవుతుందని వెల్లడించారు. సుమారు లక్ష మంది కార్యకర్తలు వచ్చేలా అందరూ శ్రమించాలన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని డైట్, రాంలీలా మైదానాలను నాయకులు పరిశీలించారు. ఇందులో పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ బద్దం లింగారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు చిట్యాల సుహాసిని రెడ్డి, గంగా రెడ్డి, బోయర్ విజయ్ తదితరులు ఉన్నారు.

మంత్రి కేటీఆర్ పర్యటనలో ఉద్రిక్తత

- దూసుకెళ్లిన డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



సొమ్మసిల్లి పడిపోయిన ఆశాకార్యకర్త

దిలావర్‌పూర్: మండలంలోని గుండంపల్లి గ్రామ సమీపాన కాళేశ్వరం 27వ ప్యాకేజీ ప్రారంభోత్సవానికి వచ్చిన కేటీఆర్ ఎదుట నిరసన వ్యక్తం చేసేందుకు వచ్చిన ఆయా పార్టీల నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం ఉదయం కేటీఆర్ గుండంపల్లి చేరుకున్న తరుణంలో డీసీసీ అధ్యక్షుడు కుచాడి శ్రీహరిరావు నిరసన వ్యక్తం చేసేందుకు హెలీప్యాడ్ వద్దకు వెళ్తున్న తరుణంలో ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు పూర్తి కాక మునుపే ప్రారంభోత్సవాలు చేయడం ఏమిటని శ్రీహరిరావు ప్రశ్నించారు. ఎత్తిపోతల పతకాలకు సంబంధిచి ప్యాకేజీ 27లోని మోటార్లకు ఇప్పటికీ విద్యుత్ సదుపాయం లేదని, కేటీఆర్ ప్రారంభోత్సవంలో సైతం చుట్టుపక్కల గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేసి ఒక్క మోటారును ఆన్ చేశారని, అదీ కూడా ట్రయల్ రన్ మాత్రమేనని ఇది పూర్తి ప్రారంభోత్సవం కాదని శ్రీహరిరావు అన్నారు.

బీజేపీ నేతల అరెస్టు...

మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో ముందస్తుగా బీజేపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. బీజేపీ మండల నేతలైన డి.ముత్యంరెడ్డి, దిలావర్‌పూర్ సర్పంచ్ జంగం వీరేశ్‌తో పాటు మండల పార్టీ అధ్యక్షుడు శైలేశ్వర్‌తో పాటు మరో 20మందిని పోలీసులు మంగళవారం రాత్రి అరెస్ట్ చేసి కేటీఆర్ పర్యటన అనంతరం బుధవారం వారిని వదిలిపెట్టారు. ఇది నియంతృత్వ పాలన అని సరైన సమయంలో ప్రజలు బుద్ధిచెబుతారని వారు అన్నారు.

కేటీఆర్ పర్యటనలో స్వల్ప ఉద్రిక్తత

తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఆశా వర్కర్ల నిరసనలు కొనసాగుతున్నాయి. దిలావర్‌పూర్‌లో ఉదయం స్థానిక ఆశా కార్యకర్తలు భిక్షాటన చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. బుధవారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో తమ సమస్యలను కేటీఆర్‌కు విన్నవిస్తామని అక్కడకు తరలివెళ్లిన పలువురు ఆశా కార్యకర్తలను గుండంపల్లి గ్రామం వద్దనే నిలువరించడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. కొంతమందిని పోలీసులు నిలువరించడంతో ఓ ఆశ కార్యకర్త సొమ్మసిల్లి పడిపోవడంతో తోటి ఆశాలు ఆమెకు నీరు తాగించి చెట్టునీడకు తీసుకెళ్లారు.

ఆర్మీ జవాన్‌కు ఘన స్వాగతం



తల్లిదండ్రులతో జవాన్ జాదవ్ రాజేష్

నార్నూర్: మండలంలోని ఉమ్రి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ జాదవ్ రాజేష్‌కు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు బుధవారం ఘనంగా స్వాగతం పలికారు. గ్రామానికి చెందిన జాదవ్ బలిరాం, ప్రమీల దంపతుల రెండో కూమారుడు రాజేష్ రెండేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అగ్నిపథ్‌లో భాగంగా ఆర్మీకి ఎంపికయ్యాడు. సికింద్రాబాద్‌లోని ఆర్మీ అకాడమీలో శిక్షణ పొందాడు. భోపాల్ సరిహద్దులో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడానికి వెళ్లే ముందు నెల రోజులు సెలవు ఇచ్చారు. దీంతో తొలిసారిగా స్వగ్రామానికి వచ్చాడు. తల్లిదండ్రులకు ఆర్మీ టోపీలు ధరింపజేసి గౌరవ వందనం చేశాడు.

ఆనందంగా ఉంది..

– జాదవ్ రాజేశ్, ఆర్మీ జవాన్

చిన్నప్పటి నుంచి ఆర్మీలో చేరి దేశ సేవ చేయాలనే లక్ష్యంతో ఉన్నాను. ఇంటర్ పూర్తి చేసిన తర్వాత ఆర్మీలో చేరేందుకు ప్రయత్నం మొదలు పెట్టాను. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించాను. ఆర్మీ అకాడమీలో శిక్షణ పూర్తి చేశాను. భోపాల్ సరిహద్దులో పోస్టింగ్ వచ్చింది. ఆర్మీలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడంతోపాటు దేశ సేవ చేసే అదృష్టం దక్కినందుకు చాలా సంతోషంగా ఉంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చూపిన ప్రేమాభిమానం, వారిచ్చిన స్ఫూర్తితో మరింత ఉత్సాహంగా దేశ సేవలో పాల్గొంటాను.

కానిస్టేబుల్ ఫలితాలు విడుదల



బోరి కళ్యాణ్



సాయి చరణ్ రెడ్డి



అంకిత



బట్టు రాహుల్



రవి

- జిల్లాలో 330 మంది ఎంపిక

ఎదులాపురం: పోలీసు కానిస్టేబుల్ ఫలితాలు ప్రభుత్వం బుధవారం రాత్రి విడుదల చేసింది. జిల్లాకు చెందిన 330 మంది అభ్యర్థులు కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికయ్యారు. ఇది వరకే దేహదారుఢ్య పరీక్షలు, ప్రిలిమినరీలో అర్హత సాధించి తుది పరీక్ష రాశారు. ఫలితాలను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. సివిల్ కానిస్టేబుల్ పోస్టులకు 149 మంది, ఏఆర్‌కు 84 మంది, తెలంగాణ స్పెషల్ పోలీసు (టీఎస్‌ఎస్‌పీ)కి 97 మంది అర్హత సాధించి ఉద్యోగాలు పొందారు. కుటుంబీకులు, బంధువులు వారిని అభినందించారు.

అలాగే ఆదిలాబాద్ పట్టణంలోని డీఈవో కార్యాలయంలో సబార్డినేట్‌గా పనిచేస్తున్న రాథోడ్ కవిత కూతురు రాథోడ్ సింధు సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది. సింధు తండ్రి శివాజీ పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో మృతిచెందాడు. తండ్రి ఆశయాన్ని ఆమె కొనసాగిస్తోంది.

ఎంపికైన యువకులు



రాథోడ్ సింధు

తాంసి: కానిస్టేబుల్ ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు ప్రతిభ కనబరిచి ఉద్యోగానికి ఎంపికయ్యారు. తాంసి గ్రామానికి చెందిన చిలుకూరి సా యిచరణ్‌రెడ్డి, బట్టు రాహుల్ ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అలాగే భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామానికి చెందిన ఇద్దరు ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన రవి ఏఆర్ కానిస్టేబుల్‌కి ఎంపిక కాగా, అంకిత కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైంది. ఉద్యోగాలు సాధించిన యువతి, యువకులను గ్రామస్తులు అభినందించారు.

కానిస్టేబుల్ ఉద్యోగాలకు పలువురి ఎంపిక

జైనథ్: కానిస్టేబుల్ ఫలితాల్లో మండలంలోని బాలాపూర్‌కు చెందిన వై. ప్రశాంత్, జి.బబ్లు, జి.వంశీ, మాకోడ గ్రామానికి చెందిన బి.అఖిల్, బెల్లూరికి చెందిన దశరథ్, ప్రణయ్, కూర గ్రామానికి చెందిన అఖిల్‌రెడ్డి ఎంపికయ్యారు. వీరిని వారి వారి గ్రామస్తులు అభినందించారు.

మానవత్వం పరిమళించిన వేళ



శిశువు మృతదేహంతో స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలో గిరిజన శిశువు మృతదేహానికి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అంత్యక్రియలు నిర్వహించారు. వివరాల్లోకి వెళితే నార్నూర్ మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ ప్రసవం నిమిత్తం ఆస్పత్రిలో చేరారు. బుధవారం ఆమె ఇద్దరు కవల పిల్లలకు జన్మనివ్వగా ఒక శిశువు మృతి చెందింది. ఆ శిశువుకు అంత్యక్రియలు నిర్వహించలేని కుటుంబ సభ్యుల దయనీయ పరిస్థితి తెలుసుకున్న స్వచ్ఛంద సంస్థలు బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ, సూరజ్ ఫౌండేషన్ ప్రతినిధులు జిల్లా కేంద్రంలోని పిట్టలవాడ వైకుంఠ దామంలో శిశువుకు అంత్యక్రియలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అబ్దుల్ అజీజ్, శశికళ, రిమ్స్ ఐటీడీఏ లాంగ్వేజ్ కౌన్సిలర్ సంతోష్ ఉన్నారు.

బాలిక కిడ్నాప్.. యువకుడిపై కేసు

- పోలీసుస్టేషన్‌లో ఆత్మహత్యాయత్నం
- అడ్డుకున్న హోంగార్డుపై బ్లేడ్‌తో దాడి



గాయపడ్డ నిందితుడు అరుణ్

గుడిహత్నూర్: మండల కేంద్రానికి చెందిన బాలిక కిడ్నాప్ ఘటనలో ఓ యువకుడిపై అట్రాసిటీ కేసు నమోదైంది. పోలీసులు స్టేషన్‌కు తీసుకు రాగా ఆత్మహత్యాయత్నం చేశాడు. అడ్డుకోబోయిన హోంగార్డుపై దాడి చేయగా తీవ్ర గాయమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిహత్నూర్‌కు చెందిన బాలికను ఇదే గ్రామంలోని ట్రాక్టర్ డ్రైవర్ వస్తాద్ అరుణ్ ఆదివారం వెంట తీసుకెళ్లాడు. బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సోమవారం బాలిక, యువకుడు ఇళ్లకు వచ్చారు. వివరాలు తెలుసుకున్న పోలీసులు అరుణ్‌పై కిడ్నాప్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. బుధవారం ఆ యువకుడిని స్టేషన్‌కు తీసుకు రాగా తనపై కేసు నమోదు చేస్తే గొంతు కొసుకుని చనిపోతానని పోలీసులను బెదిరించాడు. అడ్డుకోబోయిన హోంగార్డు ఉత్తంపై బ్లేడుతో గాయం చేశాడు. పక్కనే ఉన్న ఎస్సై ఇమ్రాన్ అడ్డుకోగా.. ఆయన వేలికి గాయమైంది. ఆ వెంటనే తన గొంతుకు స్వల్ప గాయం చేసుకున్న అరుణ్‌ను, హోంగార్డును రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. అరుణ్‌పై కిడ్నాప్, అట్రాసిటీ, విధులకు ఆటంకం కలిగించడం, పోలీసులపై హత్యాయత్నం కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

హత్య కేసు ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామకృష్ణ

ఉట్నూర్‌రూరల్: గిరిజన మహిళ హత్య జరిగిన 24గంటల్లోనే పోలీసులు కేసును ఛేదించారు. ఈ హత్యకు గల కారణాలను బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై మనోహర్, సీఐ రామకృష్ణ వివరాలు వెల్లడించారు. మండలంలోని తుకారాం నగర్‌కి చెందిన మెస్రం దేవుబాయి(45) హత్యకు గురైన విషయం అందరికీ తెలిసిందే. సంఘటన స్థలంలో పోలీసులు డాగ్‌స్కాడ్‌తో గాలింపు చర్యలు ముమ్మరం చేసి నిందితుడు తొడసం శంకర్‌ను పట్టుకున్నారు. ఐదేళ్ల క్రితం నిందితుడు తండ్రి లక్ష్మణ్‌కు మృతురాలు మంత్రాలు చేసి చంపిందని, ఇటీవల నిందితుడి కుటుంబంలో అందరూ జ్వరాలతో బాధపడుతున్నారని, అందుకు సైతం మంత్రాలే కారణమని దేవుబాయిపై కక్ష్య పెంచుకున్నాడు. సోమవారం చేనులో ఒంటరిగా ఉన్న దేవుబాయిని కట్టెతో కొట్టి హత్య చేశాడు. మృతురాలిపై ఉన్న ముక్కు పుడక, పుస్తె, వెండి పట్టీలు తీసుకుని పారిపోయాడు. పోలీసులు డాగ్ స్కాడ్‌తో బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో పట్టుకుని అరెస్టు చేశారు. విచారణలో హత్య చేసినట్లు నిజం ఒప్పుకున్నాడు. అలాగే మృతురాలుపై ఉన్న వస్తువులు ఓ బంగారు దుకాణంలో రూ.8వేలకు అమ్మకోగా రూ.5వేలు ఖర్చు చేశాడు. నిందితుడి నుంచి రూ.3వేలు, దుకాణంలోని వస్తువులను రికవరీ చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు. కేసును ఛేదించిన సీఐ, ఎస్సై, సిబ్బందిని డీఎస్పీ నాగేందర్ అభినందించారు. ఇందులో ఎస్సై మనోహర్ ఉన్నారు.

గుండెపోటుతో బీఆర్‌ఎస్ నాయకుడి మృతి



అబుజర్(ఫైల్)

ఉట్నూర్‌రూరల్: గుండెపోటుతో బీఆర్‌ఎస్ నాయకుడు అబుజర్ బుధవారం తెల్లవారు జామున మృతిచెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో నివాసం ఉండే అబుజర్ (42) మంగళవారం జ్వరం వచ్చిందని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. అక్కడ పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని ఆదిలాబాద్ రిమ్స్‌కు రెఫర్ చేశారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతిచెందాడు. జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, ఎంపీపీ జైవంత్‌రావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు మృతదేహానికి నివాళులర్పించి అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

ఎంపీ సోయం బాపూరావును కలిసిన లబాన నాయకులు



ఎంపీతో మాట్లాడుతున్న లబాన నాయకులు

నేరడిగొండ: నేరడిగొండ మండలానికి చెందిన లబాన నాయకులు సోనయ్య హీరాసింగ్, సాబ్లే సంతోష్ సింగ్, సోలంకి ప్రశాంత్‌లు బుధవారం ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావును జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 10న ఆదిలాబాద్ జిల్లాకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వస్తున్న నేపథ్యంలో తమ రిజర్వేషన్ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లేలా అవకాశం కల్పించాలని కోరారు. ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఆదివాసీ గిరిజన హక్కుల సాధనకు ఉద్యమిద్దాం

ఇంద్రవెల్లి: ఆదివాసీ గిరిజన హక్కుల సాధనకు ఉద్యమించాలని జిల్లా రాయిసెంటర్ సార్మేడి మెస్రం దుర్గు అన్నారు. బుధవారం మండలంలోని వడ్‌గాం గ్రామంలో నాలుగు రాయిసెంటర్ సార్మేడిలు, గ్రామ పటేళ్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంద్రవెల్లి మండల కేంద్రంలో కుమురంభీం కాంస్య విగ్రహం ఏర్పాటుపై చర్చించి పలు తీర్మాణాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నం.3 పునరుద్ధరణ సాధనకు ఆదివాసీలు లడాయికి సిద్ధం కావాలన్నారు. ఆదివాసీ 9తెగల సమన్వయ కర్త సీడాం భీంరావ్, కేస్లాపూర్ రాయిసెంటర్ సార్మేడి మెస్రం వెంకట్‌రావు పటేల్ తదితరులు ఉన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పీవో

ఉట్నూర్‌రూరల్: గిరిజన విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగాల్లో రాణించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. బుధవారం ఉట్నూర్ కేబీ కాంప్లెక్ ప్రాంగణంలో నిర్వహించిన జోనల్‌స్థాయి ఆశ్రమ పాఠశాలల క్రీడోత్సవాలలో పీవో పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో జోనల్‌స్థాయి పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు చెందిన 1200 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనడం జరిగిందని తెలిపారు. కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, ఆర్చరీ, వాలీబాల్, క్యారం, చెస్, టెన్నికాయిడ్ వంటి పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. డీడీ దిలీప్‌కుమార్, నిర్మల్ జిల్లా డీటీడీవో అంబాజీ, క్రీడల అధికారి పార్థసారథి, ఏటీడీవోలు క్రాంతికుమార్, నిహారిక, అమిత్‌కుమార్, ఏసీఎంవో జగన్, తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన ఘటనలో 10 మందిపై కేసు

- నలుగురి రిమాండ్. పరారీలో ఆరుగురు

ఎదులాపురం: రావాల్సిన డబ్బులు అడిగినందుకు ఇరువురిపై పలువురు దాడికి పాల్పడిన సంఘటన పట్టణంలోని వన్‌టౌన్ పరిధిలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ ఎస్సై నారాయణ కథనం ప్రకారం మహారాష్ట్రలోని సార్‌ఖానికి చెందిన సయ్యద్ సమ్మద్ ఫజ్లాని, సయ్యద్ వాజీద్‌లకు స్థానికుడైన షారూక్ ఖాన్ డబ్బులు ఇచ్చేది ఉండగా వారు కారులో సార్‌ఖాని నుంచి ఆదిలాబాద్‌కు వచ్చారు. స్థానిక పంజాబ్‌చౌక్‌లో షారూఖ్‌ఖాన్‌ను కలసి డబ్బులు అడగగా వారి మధ్య గొడవ చోటుచేసుకుంది. దీంతో షారుఖ్‌ఖాన్‌తో పాటు స్థానికులైన మరో తొమ్మిది మంది షమిఉల్లాఖాన్, భూషన్‌త్రిపాఠి, పఠి, రాజు, కిష్టు, షేక్ షమీర్, జీశాన్, కలీం, జునైద్‌లు వారి ఇరువురిని కర్రలతో కొట్టడమే కాకుండా, ఇన్నోవా వాహనాన్ని ధ్వంసం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు కారణమైన పది మందిలో నలుగురిని రిమాండ్‌కు తరలించారు. మిగిలిన ఆరుగురు పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.